సంస్కృతి ఇంజినీరింగ్ కళాశాలలో స్పోర్ట్స్ మీట్‌ను ప్రారంభిస్తున్న సీఐ గోవర్ధనగిరి తదితరులు

సంకల్ప్ 2K24 వార్షిక స్పోర్ట్స్ మీట్

ఘట్‌కేసర్, ఫిబ్రవరి 9: ఘట్‌కేసర్ మున్సిపాలిటీ పరిధిలోని సంస్కృతి ఇంజినీరింగ్ కళాశాలలో 2K24 వార్షిక స్పోర్ట్స్ మీట్‌ను శుక్రవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ఘట్‌కేసర్ సీఐ జి.గోవర్ధనగిరి, ఎస్ఐ డి.అశోక్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఐ గోవర్ధనగిరి మాట్లాడుతూ.. విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు.క్రీడలతోనే గుర్తింపు,ఉపాధి లభిస్తుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ సి.ఉదయ్ కిరణ్, ఫార్మసీ ప్రిన్సిపాల్ వై.శిరీష, పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె.శివకేశవ రెడ్డి, గ్రూప్‌ఆఫ్ కాలేజీస్ చైర్మన్ ఏవి రమణారెడ్డి, సెక్రటరీ ఎం.రాజేంద్రకృష్ణ, ప్రోగ్రాం కన్వీనర్ జె.మోహన్, విద్యార్థులు పాల్గొన్నారు.

డ్రగ్స్‌పై అవగాహన

నేరేడ్‌మెట్, ఫిబ్రవరి 9 : గౌతంనగర్ డివిజన్ కమ్యూనిటీహాలులో శుక్రవారం రాచకొండ పోలీసుల ఆధ్వర్యంలో కమ్యూనిటీ పోలీసింగ్, సీసీటీవీ కెమెరాలు, డయల్ 100, సైబర్‌క్రైం, డ్రగ్స్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గౌతంనగర్ సెక్టార్ ఎస్సై లక్ష్మయ్య , అధికారులు, ప్రజా ప్రతినిధులు హాజరయ్యారు. ఈసందర్భంగా ఎస్సై లక్ష్మయ్య మాట్లాడుతూ.. ఎవరైనా గంజాయికి అలవాటు పడితే వెంటనే డయల్ 100కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలన్నారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ లేకుండా ప్రయాణం చేయరాదని సూచించారు. మాదక ద్రవ్యాల వాడకం వల్ల కలిగే నష్టాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

చర్లపల్లి, ఫిబ్రవరి 9 : చర్లపల్లి డివిజన్ భరత్‌నగర్‌కు చెందిన అలకుంట గండయ్య మృతి చెందాడు. బీఎల్ఆర్ ట్రస్ట్ చైర్మన్, ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఆదేశాల మేరకు మృతుడి కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయం అందజేశామని ట్రస్ట్ ప్రతినిధి నేమూరి మహేశ్‌గౌడ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ ప్రతినిధులు నయీం, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహించాలి

- మార్చి 6 నుంచి 11 తేదీ వరకు కీసరగుట్ట బ్రహ్మోత్సవాలు
- భక్తులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు
- దర్శనానికి టికెట్లు ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచాలి
- అధికారుల సమీక్ష సమావేశంలో మేడ్చల్ కలెక్టర్ గౌతమ్

మేడ్చల్ కలెక్టరేట్, ఫిబ్రవరి 9 : కీసరగుట్ట మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలకు విచ్చేసే సామాన్య భక్తులకు పెద్దపీట వేయాలని మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతమ్ అధికారులను ఆదేశించారు. మార్చి 6 నుంచి 11 తేదీ వరకు 6 రోజుల పాటు కీసరగుట్టలో జరిగే మహా శివరాత్రి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై శుక్రవారం కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. రాష్ట్రంలోనే ప్రఖ్యాత శైవక్షేత్రమమైన కీసరగుట్ట శ్రీ భవానీరామలింగేశ్వర స్వామి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహించాలన్నారు. గుట్టకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేయాలని పేర్కొన్నారు. ఆన్‌లైన్ టికెట్ల ద్వారా స్వామి దర్శనం కల్పించాలని, దర్శనానికి ఏర్పాటు చేసిన 6 క్యూలైన్లలో మూడు క్యూలైన్లను సామాన్య భక్తుల దర్శనం కోసం కేటాయించాలని అధికారులకు సూచించారు. భక్తులకు తాగునీటిని సరఫరా చేయాలని మిషన్ భగీరథ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. చలువ పందిళ్లు, పరిసరాలు శుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని, వాహనాల పార్కింగ్, బారికేడింగ్ ఉండాలన్నారు. రహదారి వెంట విద్యుత్ దీపాలను ఏర్పాటు చేయాలని, వాటర్ ట్యాంకులను శుభ్రం చేయించాలని చెప్పారు. నిరంతరం విద్యుత్ సరఫరా చేయాలని, అంబులెన్స్, వైద్య సదుపాయాలు కల్పించాలని సూచించారు. అగ్నిమాపక సిబ్బంది ఫైర్ ఇంజిన్లు అందుబాటులో ఉంచాలని, ట్రాఫిక్ సమస్యల్లేకుండా ట్రాఫిక్ విభాగం, పోలీస్ శాఖ బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి, డీఆర్ఓ హరిప్రియ, మల్కాజిగిరి డీసీపీ పద్మజ, ఆర్డీఓ రాజేశ్ కుమార్, ఆలయ చైర్మన్ తటాకం నాగలింగంశర్మ, ఈఓ నరేంద్ర, ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు, జిల్లా అధికారులు, పోలీస్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో కీసరగుట్ట మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ గౌతమ్, పాల్గొన్న అధికారులు

ఫైనాన్స్ అకౌంటింగ్-2 పుస్తకావిష్కరణ

శామీర్‌పేట, ఫిబ్రవరి 9 : విద్యార్థులకు ఉపయోగకరమైన ఆవిష్కరణల రూపకల్పన చేయడం హర్షణీయమని తెలంగాణ సాంఘీక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల జగద్గిరిగుట్ట(శామీర్‌పేట) ప్రిన్సిపాల్ డాక్టర్ ఇషత్ అన్నారు. శామీర్‌పేటలోని క్యాంపస్‌లో కామర్స్ డిపార్ట్‌మెంట్‌కు చెందిన శ్రీలత రచించిన బీకామ్ సీఏ మొదటి సంవత్సరంలో ఫైనాన్స్ అకౌంటింగ్-2 పుస్తకాన్ని శుక్రవారం డిగ్రీ కళాశాలలో లాంఛనంగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఫైనాన్స్ అకౌంటింగ్ -2 పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ ఇషత్

'పీవీ'కి భారతరత్న ..హర్షణీయం

ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి

మల్కాజిగిరి, ఫిబ్రవరి 9: దివంగత మాజీ ప్రధాని పీవీ నరసింహారావుకు భారతరత్న పురస్కారం ఇవ్వడం హర్షణీయమని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి అన్నారు. శుక్రవారం కేంద్ర ప్రభుత్వం తెలంగాణ బిడ్డ పీవీ నరసింహారావుకు భారతరత్న ప్రకటించడంతో పీవీ కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా మల్కాజిగిరి ఎమ్మెల్యే రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ గడ్డమీద పుట్టిన పీవీ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా సేవలందించడంతో పాటు దేశ ప్రధాని పదవికి వన్నె తెచ్చిన మహానుభావుడు అని పేర్కొన్నారు. పీవీ సేవలను గుర్తించి భారతరత్న పురస్కారం ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వాన్ని కొన్నేండ్లుగా బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ డిమాండ్ చేశారని గుర్తు చేశారు.

ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలి

కార్పొరేటర్ బొంతు శ్రీదేవి



ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న కార్పొరేటర్ బొంతు శ్రీదేవి తదితరులు

చర్లపల్లి, ఫిబ్రవరి 9 : పేద మహిళల కోసం ఉచిత వైద్య శిబిరాలను ఏర్పాటు చేసేందుకు స్వచ్ఛంద సంస్థలు ముందుకురావాలని చర్లపల్లి డివిజన్ కార్పొరేటర్ బొంతు శ్రీదేవి పేర్కొన్నారు. ఈసీనగర్‌లోని సీనియర్ సిటిజన్ సంక్షేమ భవనంలో అభయ అసోసియేషన్ ఫర్ ఎంపవర్‌మెంట్ ఆఫ్ ఉమెన్, ఎంఎన్‌జే ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆంకాలాజీ ఆధ్వర్యంలో ఈసీనగర్ సీనియర్ సిటిజన్ అసోసియేషన్ సహకారంతో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు అనుముల నర్సింహారెడ్డితో కలిసి కార్పొరేటర్ బొంతు శ్రీదేవి ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. మహిళలకు ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా మహిళలకు బ్రెస్ట్ క్యాన్సర్ స్క్రీనింగ్, అల్ట్రాసౌండ్, గైనిక్ పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అభయ అసోసియేషన్ కార్యదర్శి సుచిత్రరెడ్డి, ప్రతినిధులు శేషు, పద్మ, ఝాన్సీ, అపర్ణ, ఇందిరా, భాను, అలివేణి, షకీలా, బీఆర్ఎస్ నాయకులు బాల్‌రెడ్డి, ప్రభుగౌడ్, సత్తిరెడ్డి, లక్ష్మారెడ్డి, శ్రీకాంత్‌యాదవ్, రమేశ్, ఎల్లయ్య, మురళి, భాను, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ సంఘం నాయకులు పాల్గొన్నారు.

తిరుపాల్ కుటుంబాన్ని అదుకోవాలి



ఇందిరాగాంధీ చౌరస్తాలో రిలయన్స్ స్మార్ట్ స్టోర్ వద్ద నిరసన చేస్తున్న తిరుపాల్ తల్లిని ఓదారుస్తున్న కార్పొరేటర్ శాంతిశ్రీనివాస్ రెడ్డి

మల్కాజిగిరి, ఫిబ్రవరి 9: డీసీఎం వ్యాన్ ఢీకొట్టిన ప్రమాదంలో మృతి చెందిన తిరుపాల్ కుటుంబాన్ని ప్రభుత్వం అదుకోవాలని అల్వాల్ డివిజన్ కార్పొరేటర్ శాంతిశ్రీనివాస్ రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం అల్వాల్ సర్కిల్ ఇందిరాగాంధీ చౌరస్తాలోని రిలయన్స్ స్మార్ట్ స్టోర్ వద్ద అఖిలపక్షం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. తిరుపాల్ తల్లి లత, తండ్రి భరత్‌ను కార్పొరేటర్ శాంతిశ్రీనివాస్ రెడ్డి ఓదార్చి ఆర్థికంగా ఆదుకుంటామని భరోసానిచ్చారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ శాంతిశ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. డీసీఎం డ్రైవర్ నిర్లక్ష్యం వల్ల జరిగిన ఘోర ప్రమాదంలో తిరుపాల్ నిండు ప్రాణాలు కోల్పోవడం బాధాకరమన్నారు. వ్యాన్ డ్రైవర్‌తో పాటు కాంట్రాక్టర్‌పై పోలీసులు కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఢిల్లీ పరమేశ్, రాజేశ్ కన్న, సురేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాలభైరవ స్వామి దేవాలయంలో పూజలు

అన్నదానంలో పాల్గొన్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

రామంతాపూర్, ఫిబ్రవరి 9 : ఉప్పల్ భగాయత్‌లోని స్వయంభూ కాలభైరవస్వామి దేవాలయంలో నిర్వహించిన స్వామి వారి కల్యాణంలో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. స్వామి వారి దీవెనలతో నియోజకవర్గ ప్రజలు సల్లగా ఉండాలని ఆయన కోరుకున్నారు. అనంతరం జరిగిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు.కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

11న ఉచిత కంటి వైద్య శిబిరం

కాప్రా, ఫిబ్రవరి 9: మీర్‌పేట్ హెచ్‌బీకాలనీ వెంకటేశ్వరనగర్ శ్రీషిర్డీ సాయిబాబా ఆలయంలో సాయిబాబా విగ్రహ ప్రతిష్ఠాపన 29వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని ఈ నెల 11న ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. లయన్ ఎం.ఎస్. రెడ్డి లయన్స్ కంటి హాస్పిటల్ వారి సౌజన్యంతో నిర్వహించే కంటివైద్య శిబిరంలో ఉచితంగా కంటిపరీక్షలు నిర్వహించనున్నారు. అర్హులైన వారికి కంటి అద్దాలు, క్యాటరాక్ట్ ఆపరేషన్లు నిర్వహిస్తారని నిర్వాహకులు పేర్కొన్నారు. కంటి పరీక్షలు చేసుకోవాలనుకునే వారు సాయిబాబా దేవాలయంలో పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు.

బీఆర్ఎస్ సభను విజయవంతం చేస్తాం

ఎంబీసీ మాజీ చైర్మన్ నందికంటి శ్రీధర్

మాట్లాడుతున్న ఎంబీసీ మాజీ చైర్మన్ శ్రీధర్

మల్కాజిగిరి, ఫిబ్రవరి 9: బీఆర్ఎస్ పార్టీ సభను విజయవంతం చేస్తామని ఎంబీసీ మాజీ చైర్మన్ నందికంటి శ్రీధర్ అన్నారు. శుక్రవారం నల్గొండ జిల్లా మునుగోడు నియోజకవర్గంలో చండూరు మండల బీఆర్ఎస్ పార్టీ సమావేశానికి మునుగోడు ఇన్‌చార్జి, ఎంబీసీ మాజీ చైర్మన్ నందికంటి శ్రీధర్ హాజరై మాట్లాడారు. నల్గొండలో 13న జరిగే సభను ప్రతిష్టాత్మకంగా తీసుకున్నామన్నారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో నాయకులు, కార్యకర్తలు ఉత్సాహంగా పనిచేసి బీఆర్ఎస్ ఎంపీలను గెలిపించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్ రెడ్డి, పల్లె రవికుమార్, డోలి రమేశ్, శ్రీనివాస్ గౌడ్, రాములు, సూర్య ప్రకాశ్, వేణు పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి స్పందన

వైద్యశిబిరంలో వైద్య పరీక్షలు చేయించుకుంటున్న ఉప్పల శ్రీనివాస్‌గుప్తా

రామంతాపూర్, ఫిబ్రవరి 9 : అంతర్జాతీయ ఆర్య వైశ్య ఫెడరేషన్ నేతృత్వంలో, ట్రైకలర్ వైద్యశాల సహకారంతో శుక్రవారం ఉప్పల్, రామంతాపూర్ నల్లపోచమ్మ దేవాలయం వద్ద ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో ఐవీఎఫ్ తెలంగాణ అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్తా పాల్గొని వైద్యపరీక్షలు చేయించుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఆర్యవైశ్యులు సేవా కార్యక్రమాల్లో మరింత ముందుకెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐవీఎఫ్ జిల్లా అధ్యక్షుడు సంబుపాండయ్య గుప్తా, కార్యదర్శి రమేశ్ గుప్తా, ఆధ్యాత్మిక కమిటీ చైర్మన్ శ్రీనివాస్ గుప్తా, ఉప కోశాధికారి నగేశ్ గుప్తా, కోశాధికారి శ్రవన్‌గుప్తా పాల్గొన్నారు.

'వాసవి' సేవలు అభినందనీయం



వాసవి మిత్ర మండలి ఆధ్వర్యంలో పేద వృద్ధులకు ఆర్థిక సహాయం అందజేస్తున్న కేంద్ర ప్రభుత్వ సెన్సార్ బోర్డు సభ్యుడు ఉపేందర్‌గుప్తా తదితరులు

చర్లపల్లి, ఫిబ్రవరి 9: పేద ప్రజల సంక్షేమానికి వాసవి మిత్ర మండలి చేస్తున్న కృషి అభినందనీయమని కేంద్ర ప్రభుత్వ సెన్సార్ బోర్డు సభ్యుడు, ఆర్యవైశ్య మహాసభ కార్యదర్శి ఉపేందర్‌గుప్తా పేర్కొన్నారు. ఏఎస్‌రావునగర్ డివిజన్ ఈసీఐఎల్ చౌరస్తాలో మేడ్చల్ జిల్లా వాసవి మిత్ర మండలి ఆధ్వర్యంలో అమావాస్య అన్నదానం నిర్వహించిన అనంతరం పేద వృద్ధులకు ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో వాసవి మిత్ర మండలి అధ్యక్ష, కార్యదర్శులు నాగరాజుగుప్తా, శ్రీనివాస్‌గుప్తా, కృష్ణ, తిరుమలేశ్, ప్రతినిధులు పాల్గొన్నారు.

మారుతి మిత్ర మండలి ఆధ్వర్యంలో..

కుషాయిగూడ మారుతి మిత్ర మండలి ఆధ్వర్యంలో అమావాస్య అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. కుషాయిగూడ పోచమ్మ, ముత్యాలమ్మ ఆలయం వద్ద నిర్వహించిన అన్నదానం కార్యక్రమాన్ని మారుతి మిత్ర మండలి అధ్యక్ష, కార్యదర్శులు అశోక్ చారి, హనుమంత్ ప్రారంభించారు. కార్యక్రమంలో సభ్యులు వెంకట్‌రెడ్డి, వేణుగోపాల్ చారి, బాబుగౌడ్, సూరిగౌడ్, వెంకటేశ్వర స్వామి ఆలయ చైర్మన్ శ్రీనివాస్‌గౌడ్, సీతా రామిరెడ్డి పాల్గొన్నారు.

నేడు విశ్వకర్మ గ్రామసభ

కీసర, ఫిబ్రవరి 9: కీసర పంచాయతీ కార్యాలయం వద్ద నేడు విశ్వకర్మ గ్రామసభను నిర్వహిస్తున్నామని పంచాయతీ కార్యదర్శి గంగన్న తెలిపారు. శనివారం ఉదయం 10 గంటలకు పీఎం విశ్వకర్మ గ్రామసభను గ్రామ స్పెషల్ ఆఫీసర్ నందకిశోర్ అధ్యక్షతన నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. జడ్పీటీసీ, ఎంపీపీ, ఎంపీటీసీ సభ్యులు, ప్రజాప్రతినిధులు అధికారులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

వేర్వేరు చోట్ల ఇద్దరు అదృశ్యం

జవహర్‌నగర్, ఫిబ్రవరి 9 : ఇంటి నుంచి బయటకు వెళ్లిన వ్యక్తి అదృశ్యమయ్యాడు. ఈ ఘటన జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్‌హెచ్‌వో సీతారాం కథనం ప్రకారం... దమ్మాయిగూడలో అగుళ్ల శివకుమార్ కుటుంబసభ్యులతో కలిసి నివాసముంటున్నాడు. ఈ నెల 7న ఇంట్లో చెప్పకుండా బయటకు వెళ్లి ఇంత వరకు తిరిగిరాలేదు. దీంతో శివకుమార్(33) ఆచూకీ కోసం ఎంత వెతికినా సమాచారం లభించలేదు. చైతన్యపురిలో ఉండే అతని మిత్రుడితో కలిసి వెళ్లినట్లు శివకుమార్ తల్లి పద్మ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకొని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

మానసిక స్థితి సరిగా లేక..

కౌకూర్‌లో మానసిక స్థితి సరిగా లేక ఓ వ్యక్తి అదృశ్యమయ్యాడు. జవహర్‌నగర్ ఎస్‌హెచ్‌వో సీతారాం కథనం ప్రకారం... కౌకూర్‌లో త్రిపాటి గోపి, భార్య అరుణ, ఒక కుమారుడు, కుమార్తెతో కలిసి నివాసముంటున్నాడు. ఏడాది క్రితం క్రిందపడటంతో కాలికి గాయం కావడంతో ఇంటి వద్దే ఉంటున్నాడు. ఈ నెల 8న ఇంట్లో ఎవరికి చెప్పకుండా బయటకు వెళ్లి తిరిగిరాలేదు. దీంతో గోపి(55) ఆచూకీ కోసం చుట్టుపక్కల, బంధువుల వద్ద వెతికినా సమాచారం లభించలేదు. కుటుంబసభ్యుల ఫిర్యాదు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

నాగారం తైబజార్ వేలం రూ.43 లక్షలు

మేడ్చల్ కలెక్టరేట్, ఫిబ్రవరి 9 : నాగారం మున్సిపల్ కార్యాలయంలో తైబజార్, చికెన్, మటన్ వ్యర్థాలు సేకరించడానికి 2024-2025 ఆర్థిక సంవత్సరానికి వేలం నిర్వహించారు. ఈ వేలంలో తైబజార్‌ను రూ.43 లక్షల 10 వేలకు కృష్ణారావు, వ్యర్థాల సేకరణకు సంబంధించి.. రూ.5 లక్షల 12 వేలకు షేక్ చంద్ దక్కించుకున్నారు. అనంతరం వారిని మున్సిపల్ చైర్మన్ చంద్రారెడ్డి సత్కరించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ మల్లేశ్ యాదవ్, కమిషనర్ రాజేందర్‌కుమార్, మేనేజర్ చంద్రశేఖర్, కౌన్సిలర్లు శ్రీనివాస్ గౌడ్, అధికారులు పాల్గొన్నారు.

గ్రామీణ బండ్‌కు సంపూర్ణ మద్దతు

జవహర్‌నగర్, ఫిబ్రవరి 9: గ్రామీణ బండ్‌కు సంపూర్ణ మద్దతు తెలుపుతున్నామని, కార్పొరేట్ దోపిడీ రాజకీయాలకు స్వస్తి పలుకుదామని దక్షిణ భారతదేశ రాజకీయ సమాఖ్య వ్యవస్థాపక అధ్యక్షుడు మహ్మద్ రషీద్, ఇఫ్టూ జాతీయ కార్యదర్శి షేక్ షావలి అన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగడుతూ ఈ నెల 16న జరిగే కార్మిక గ్రామీణ బండ్‌కు భారత కార్మిక సంఘాలు శుక్రవారం సంపూర్ణ మద్దతు ప్రకటించాయి. ఈ కార్యక్రమంలో భారత ప్రగతిశీల మహిళా సంఘం ఐపీఓ డబ్ల్యూ పెర్క సునీత, కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

కనీస వేతనం అమలు చేయాలి

జవహర్‌నగర్, ఫిబ్రవరి 9: కార్మికుల సమ్మెకు కదన రంగమై కదులుదామని, కనీస వేతనం 26వేలు అందజేయాలని, కార్పొరేట్ కంపెనీలకు కొమ్ముకాస్తున్న బీజేపీని ప్రజా క్షేత్రంతో నిలదీయాలని బీకే ఎంయూ జిల్లా ప్రధాన కార్యదర్శి తోటపల్లి శంకర్ పిలుపునిచ్చారు. శుక్రవారం కార్పొరేషన్‌లోని దళిత సంక్షేమ భవన్‌లో ఏఐటీయూసీ, సీఐటీయూ, ఐఎఫ్‌టీయూ, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో భారత్‌బంద్‌ను విజయవంతం చేయాలని సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు అనురాధ, యాదగిరి, శివన్నారాయణ, శివబాబు, ప్రవీణ్, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

మధురానగర్ పార్కును పరిరక్షించండి

కాప్రా, ఫిబ్రవరి 9: చర్లపల్లి డివిజన్ మధురానగర్ పార్కు స్థలం కబ్జాకు గురైందని, పరిరక్షించాలని కోరుతూ చర్లపల్లి కాలనీల సమాఖ్య ఆధ్వర్యంలో కాప్రాసర్కిల్ కార్యాలయం ఎదుట శుక్రవారం ధర్నా నిర్వహించారు. అనంతరం సర్కిల్ డిప్యూటీ కమిషనర్ ముకుందరెడ్డికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా కాలనీ ప్రతినిధులు మాట్లాడుతూ... మధురానగర్‌లో పార్కు కోసం కేటాయించిన 280 చ.గజాల స్థలం కబ్జాకు గురవుతున్నదని.. చర్యలు తీసుకోవాలని రెండేళ్ల క్రితమే డీసీకి వినతిపత్రం ఇచ్చినా.. ఇంతవరకు చర్యలు తీసుకోలేదన్నారు. ధర్నాలో మధురానగర్ వెల్ఫేర్ అసోసియేషన్, సీసీఎస్ ప్రతినిధులు పద్మారెడ్డి, కొండల్‌రెడ్డి, లింగంనాయక్, శ్రీనివాస్ నాయక్, సుజాత, చంద్రకళ, భార్గవి తదితరులు పాల్గొన్నారు.

మధురానగర్ పార్కు స్థలాన్ని పరిరక్షించాలని కాప్రాసర్కిల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న కాలనీవాసులు

29న ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు

నేరేడ్‌మెట్, ఫిబ్రవరి 9 : ఆనంద్‌బాగ్ ఆర్‌యూబీ పక్కన ఉన్న సాయిబాబా దేవాలయం 28వ వార్షిక బ్రహ్మోత్సవాలు ఈనెల 29న వైభవంగా నిర్వహించనున్నట్లు దేవాలయ ప్రధాన అర్చకుడు సత్య పండిట్, దేవాలయ ట్రస్టు సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 29న ఉదయం 5:30 నిమిషాలకు కాగడ, హారతి, 6:30 గంటలకు పంచామృత అభిషేకం, 9గంటలకు సాయిసత్యవ్రతం, 12 గంటలకు హారతి, 12:30 గంటలకు అన్నప్రసాదం ,7గంటలకు పల్లకి సేవలు నిర్వహించనున్నారు.

ఆహ్వానపత్రిక విడుదల

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా కీసరగుట్ట శ్రీ ఆర్యవైశ్య నిత్యాన్నదాన సత్రం ఆహ్వాన పత్రికను శుక్రవారం మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లో విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో సత్రం చైర్మన్ బెలిదే రమేశ్ గుప్తా, కీసరగుట్ట ఆలయ చైర్మన్ తటాకం నాగలింగం శర్మ, మాజీ చైర్మన్ రమేశ్ శర్మ, ఉమాపతిశర్మ, వెంకటేశ్ శర్మ, శ్రీనివాస్‌శర్మ, ధర్మకర్తల మండలి సభ్యులు, మాజీ సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

– మేడ్చల్ కలెక్టరేట్, ఫిబ్రవరి 9

లంచం ఆశించిన సీవోలపై చర్యలు తీసుకోండి

కాప్రా, ఫిబ్రవరి 9: కాప్రాసర్కిల్‌లో మహిళా సంఘాల గ్రూపులకు రుణాలు పొందడం కోసం సహకారం అందించాల్సిన కమ్యూనిటీ ఆర్గనైజర్లు, ఆర్‌పీలు గ్రూపు సభ్యులనుంచి లంచాలు దండుకోవడంపై డిప్యూటీ కమిషనర్‌కు చర్లపల్లి కాలనీ సమాఖ్య ప్రతినిధులు శుక్రవారం ఫిర్యాదు చేశారు. రూ.లక్ష రుణం పై రూ.1200 చొప్పున సీఓలు, ఆర్‌పీలు వసూలు చేస్తున్నారని, అడిగినంత ఇవ్వకపోతే రుణం రాకుండా ఆన్‌లైన్ చేయమని బెదిరిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఎల్లారెడ్డిగూడకు చెందిన మరో గ్రూపు నుంచి రుణం మంజూరు కోసం సీఓ, ఆర్‌పీలు డబ్బు డిమాండ్ చేసినట్టు వారు ఫిర్యాదులో తెలిపారు. దీనిపై విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని డీసీ ముకుందరెడ్డిని చర్లపల్లి కాలనీ కుటుంబాల పక్షాన ఎంపల్లి పద్మారెడ్డి, అజీమ్, శ్రీనివాస్‌నాయక్ విజ్ఞప్తి చేశారు.

మహర్షి దయానంద సరస్వతి జయంతి ఉత్సవాలు

రామంతాపూర్, ఫిబ్రవరి 9 : ఉప్పల్ ఆర్యసమాజం తపస్యా ఫౌండేషన్ ఆధ్వర్యంలో మహర్షి దయానంద సరస్వతి జయంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా హాజరైన స్వామి యజ్ఞదేవ్ మహారాజ్, హరిద్వార్ డాక్టర్ కమల నారాయణ, రాయ్‌పూర్ బ్రహ్మచారి మాట్లాడారు. ఈ నెల 12 వరకు ఉత్సవాలు జరుగుతాయని తెలిపారు. ముగింపు ఉత్సవాలకు ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ హాజరవుతారన్నారు. కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.

పారిశుధ్య పనుల పరిశీలన

ఘట్‌కేసర్,ఫిబ్రవరి9 : పోచారం మున్సిపాలిటీలోని వార్డులలో జరుగుతున్న పారిశుధ్య పనులను శుక్రవారం చైర్మన్ కొండల్‌రెడ్డి పరిశీలించారు. 16వ వార్డు నారపల్లి పాత గ్రామంలో జరుగుతున్న పనులను కోఆప్షన్ సభ్యుడు అక్రం అలీ, స్థానిక ప్రజలతో కలిసి చైర్మన్ పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు.